




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## గుంటూరు పల్నాడు

శనివారం 24 మే 2025 - పేజీలు 8


బంగారు నగలు తయారీలో వర్తకుల దోపిడీ మూడు పూలు ఆరు కాయల చందంగా తరుగు దగ్గర నుంచి మజూరి వరకు బంగారు వ్యాపారులు వినియోగదారులను ఎడాపెడాదోచేస్తున్నారు. నగల తయారీలో రాగి, వెండి ఎక్కువగా కలిపి బంగారం రేటు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నగల తయారీలో మాసాలు జరుగుతున్న తనిఖీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జువెలరీ షాపుల యాజమాన్యం అనుసరిస్తున్న అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.. కోట్లలో గండిపడుతోంది. కొంతమంది వ్యాపారులు అక్కడక్కడ దొంగ బంగారాన్ని కూడా కొనుగోలు చేసి దాన్ని కరిగించి రూపురేఖలు మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఘనులు కూడా ఉన్నారు. అక్రమార్కుల వల్ల పసిడి జీరో వ్యాపారం లోకి వెళ్ళిపోయింది. హాల్ మార్క్ నిర్ణయించే బి ఎస్ ఐ స్టాండర్డ్ బంగారం తనిఖీ కేంద్రం కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో అక్రమార్కుడు ఇస్తారాజ్యంగా చెల రేగిపోతున్నారు.. మెరుగు పేరుతో బంగారాన్ని బాగా కరగదీసి ఎగరేసుకుపోతున్నారు. అలా కరగదీసిన బంగారు 70 శాతం పసిడి, మిగిలింది కల్తీ ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో నమ్మకం, నకిలీ ఒకటిగా మారాయనే విమర్శ వినవస్తోంది...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



# బంగారంలా... దగా..!!



వినియోగదారుని నమ్మకంపైనే అధారపడి నడిచే బంగారం నగల తయారీ, విక్రయాల్లో కల్తీ రాజ్యమేలుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేక పట్టణాల్లో నాణ్యతలేని బంగారం,కాకి బంగారం విక్రయాలతో, కొనుగోళ్లతో ప్రజలు మోసపోతున్నారు. వ్యాపారులు నాణ్యత తక్కువగా ఉన్న బంగారం వినియోగదారులకు అంటగడుతూ.. భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. బంగార వ్యాపారులు చాలా మంది రసీదులు ఇవ్వకుండా ప్రభుత్వ పన్నులు కూడ ఎగవేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం ఖజానాకు కోట్లాది రూపాయలు కన్నం పడుతోంది. అంతేకాక వాణిజ్య పన్నుల శాఖ పన్నుల చెల్లింపులోనూ, ఆదాయ పన్నుల చెల్లింపులోనూ, ఎగనామం పెడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బంగారం నగల హాల్‌మార్క్ నిర్ణయించే బిఎస్ఐ స్టాండర్డ్ బంగారం తనిఖీ కేంద్రం సక్రమంగా పని చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టారా జ్యంగా వ్యవహరి స్తున్నారు. వెరసి కల్తీ ఎక్కువగా ఉండి బంగారం శాతం తక్కువగా ఉన్న నగలు కొనుగోలు చేసి

**ఎంత మోసం..!!**

- దండిగా ధర .!
- పసిడి వ్యాపారంలో పక్కా మోసం
- జోరుగా జీరో వ్యాపారం
- చోరీ నగలు కొనుగోలు చేస్తున్న వైనం
- తరుగు పేరుతో పెద్ద ఎత్తున మోసం
- తూకం లోనూ చేతివాటం

ఈ ప్రాంత ప్రజలు మోసపోతున్నారు. ఒకప్పుడు కులవృత్తికి పరిమితమైన బంగారం నగల తయారీలో వివిధ వర్గాల వ్యాపారులు రంగప్రవేశం చేశారు. దానికి తోడు జిల్లా కేంద్రాల్లో కార్పోరేట్ సంస్థలు వెలిశాయి. దీంతో కులవృత్తిని నమ్ముకున్న కంసాలీలు కూలీలయ్యారు. బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారుల దుకాణాల్లో రోజువారీ కూలీలుగా పోట్టపోసుకుంటున్నారు. కంసాలీల పనితనాన్ని పెట్టుబడిగా పెట్టి వ్యాపారులు సిండికేట్‌గా మారి, దోపిడీకి పాల్పడుతున్నారు. బంగారం తూకంలో కూడ మోసం జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఎక్కడ బంగారం సొత్తు చోరీ జరిగిన ఉమ్మడి జిల్లాలో కొంతమంది వ్యాపారులనే తీసుకువెళ్లడం జరుగుతోంది. తరచూ భారీ ఎత్తున రికవరీలు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో బంగారం వ్యాపారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాపారంలో ఎలాంటి రిజిష్టర్‌లు నిర్వహించడం లేదని తెలుస్తోంది

కల్తీ బంగారంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన బంగారం 24 క్యారెట్లు ఉండి. 100 శాతం ఫిట్‌నెస్ కలిగి ఉండాలి. బంగారు నగలలో బంగారం శాతం 91.6 నాణ్యత కలిగి ఉండాలి. అలాగే 22 క్యారెట్స్ కలిగి ఉండాలి. ఎందుకంటే బంగారు నగలు తయారు చేసేటప్పుడు అతకడం కోసం అందులో రాగి, వెండిని కలుపుతారు. అయితే ప్రస్తుతం కెడియం అనేలోహాన్నికలుపుతున్నారు. కెడియం కలపడం మూలంగా అతుకు వేసిన చోట తెలుపురాకుండా ఉంటుంది. కానీ ఈ ప్రాంతంలో బంగారు నగల తయారీలో రాగి, వెండి శాతంఅధికంగాఉంటుందని విమర్శలున్నాయి. ఏరోజుకు ఆరోజు బొంబాయి నుంచి వచ్చే బంగారం ధర, ఆర్ణమెంట్ ధర ప్రకారం బంగారం విక్రయాలు జరగాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ బొంబాయి రేటుకంటే తక్కువ రేటుకే బంగారం విక్రయి స్తారు. కారణం కల్తీ ఎక్కువగా ఉంటుందని సమాచారం. ఈ ప్రాంతంలో తయారు చేసిన ఆభరణాలలో 80 శాతానికి మించి బంగారం ఫిట్‌నెస్ ఉండడం లేదని ప్రజలు చెబుతున్నారు. 18 క్యారెట్లు మాత్రమే ఇస్తున్నారని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం మిగతా 3వ పేజీలో

# పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం

**జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వెల్లడి**

**ఎంఎస్ఎంఈలకు రూ.6.72 కోట్లు కేటాయింపు**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ ( డీఐఈపీసీ) సమావేశం జరిగింది. సమావేశంలో అజెండాకు సంబంధించి చర్చించిన అంశాలపై జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్ఎస్ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమల శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. మంగళగిరి మిగతా 3వ పేజీలో








# విజిలెన్స్ దాడుల్లో భారీగా సిగరెట్ల పట్టివేత

- రూ.1.98 కోట్ల విలువగల సిగరెట్లుగా గుర్తింపు
- అనుమతి లేకుండా విక్రయాలు
- కేసు నమోదు చేయాల్సిందిగా పాత గుంటూరు పోలీసులకు ఆదేశం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, గుంటూరు జిల్లా లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శుక్రవారం దాడి చేసి భారీ ఎత్తులో సిగరెట్లు మిగతా 3వ పేజీలో

## అన్నదానం మహాదానంతో సమానం



**గుంటూరు జిల్లా, నేటిదిన పత్రిక సూర్య బ్యూరో**

అన్నదానం మహాదానంతో సమానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి జయంతి సందర్భంగా శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బుచ్చయ్య తోట ఐదో లైనులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. తొలుత ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా భక్తులతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఇలాంటి అన్నదాన కార్యక్రమాల ద్వారా సమైక్యతా భావం పెంపొందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బత్తిని శంకర్, పులిగడ్డ నాగేశ్వరావు, గుడిపల్లి వాణి, ఎర్రగోపు నాగేశ్వరావు, సముద్రాల గణేష్, అరవపల్లి శ్రీను, ఆదిలక్ష్మి, నారాయణ, త్రిపుర కుమార్, బిట్రగుంట శ్రీనివాస్, కోట రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు



**విద్యార్థులను అభినందిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొణిదెల పవన్ కల్యాణ్**

**చేబ్రోలు, మేజర్ న్యూస్:** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు డీ.నరేంద్రనాథ్, చల్లా సంజనాలకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ కేంద్రం (సీఈపీసీ) మరియు యూనివర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డుతో కలిసి విద్యార్థుల కోసం మూడు విభిన్న విభాగాలలో వ్యాస రచన, చిత్రలేఖనం మరియు ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో తమ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు చల్లా సంజనా (పెయింటింగ్), డీ.నరేంద్రనాథ్ (ఫోటోగ్రఫీ) విభాగాలలో రాష్ట్ర స్థాయి కేటగిరీలో పోటీపడి మొదటి విజేతలుగా నిలిచారన్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొణిదెల పవన్ కల్యాణ్ గారి చేతుల మీదుగా మెమెంటోలు మరియు ప్రామాణిక పత్రాలు అందజేసారని వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన డీ.నరేంద్రనాథ్, చల్లా సంజనాలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## మహేష్ యాదవ్‌కు మంత్రి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు



**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** ఉండవల్లిలో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ను ఆయన నివాసంలో గురువారం స్థానిక టీడీపీ నాయకులు, ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి లోకేష్, మహేష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న మహేష్ యాదవ్ ను లోకేష్ అభినందించారు. ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు కర్రేటి సురేష్ బాబు, గడవర్తి నాగేశ్వరరావు, సురేష్ బాబు, రాంబాబు, తాడిబోయిన గోపి కృష్ణ, బట్టు రామకృష్ణ, తన్నీరు తరుణ్ తదితరులు మంత్రి లోకేష్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# టీడీపీకి కార్యకర్తలే ఊపిరి : ఎమ్మెల్యే నసీర్

- కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండటం మా బాధ్యత
- మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి అని, అలాంటి కార్యకర్తల ఊపిరి ఆగినప్పుడు వారి కుటుంబానికి అండగా నిలవడం మా బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని వల్లూరివారితోటకు చెందిన వింజమూరి నాగమణి రోడ్డు ప్రమాదంలో మరణించారు. నాగమణి తెలుగుదేశం పార్టీకి కష్ట కాలంలో వెన్నంటి నడిచారు. దీంతో నాగమణి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరు చేశారు. ఈ చెక్కును శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యులు నసీర్ మృతురాలి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల సేవలో నిరంతరంగా పనిచేసే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు త్యాగస్వభావం కలవారని, పట్టుదల, నిజాయితీ వారి సొంతమని కొనియాడారు., పార్టీ విజయాల వెనుక ఉన్న శక్తి వారేనని పేర్కొన్నారు. అలాంటి కార్యకర్తలను ప్రోత్సహించడమే కాదు, వారి అవసరాలను గుర్తించి సహాయపడటానికి మనందరం ముందుకు వస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్ సంకల్పంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువలను శుభ్రపరచాలి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న కాలువలను మున్సిపల్ సిబ్బంది వెంటనే శుభ్రపరచాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. గతంలో వర్షాకాలంలో నీళ్లు ఇళ్లలోకి చేరటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మురుగు నీరు నిలబడకుండా, సిల్టేషన్ తొలగింపు పనులు ప్రారంభించాలన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరించవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల్ని పరిష్కరించటమే తన ధ్యేయం అని, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయము తోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో కొన్ని కరోనా కేసులు నమోదు అయ్యాయని దానిని దృష్టిలో ఉంచుకొని, ప్రజలు వ్యక్తిగత దూరం పాటిస్తూ, అవసరమయిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్ రెడ్డి %ఽ% కో ఇష్టానుసారం దోచుకుని తిని నేడు ప్రజల ముందు కళ్ళు ఆర్పకుండా అబద్ధాలు చెప్పే ఘనుడు జగన్ మోహన్ రెడ్డి అని, ఆయనను ఎవరూ విశ్వసించరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.



# కొత్తూరులో రాఫా క్లినిక్ ప్రారంభం

**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** మంగళగిరి –తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి కొత్తూరులో డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాఫా క్లినిక్‌ను శుక్రవారం రెవ.పాస్టర్ ఎం.దేవరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఫా క్లినిక్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మంచి వైద్య సేవలను అందించి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. రాఫా క్లినిక్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ క్లినిక్ లో 24 గంటలు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, జనరల్ మెడిసిన్ గుండె సంబంధిత వ్యాధుల వంటి వాటికి సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమం రవి కిషోర్,ఎం.అబ్రాహాం, యోహాన్, దానియేలు, ప్రేమ్ కుమార్,సురేష్,ప్రేమ్ కుమార్, జాన్ మోజెస్,రఫా క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## అవుట్ ఫాల్ డ్రైన్లలో పూడిక తీత పనులు వేగవంతం చేయండి : కమిషనర్

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అవుట్ ఫాల్ డ్రైన్లలో పూడిక తీత పనులు వేగవంతం చేయాలని, మైనర్ డ్రైన్లు అవుట్ ఫాల్ డ్రైన్లలో కలిసే ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ శాంతి నగర్, రత్నపురి కాలనీ, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** తాడేపల్లి లోని పద్మశాలి వీధికి చెందిన ఎస్ కే మహబూబ్ సుభానీ (50) తన నివాస గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత మూడు రోజులు క్రితం సుభాని ఉరివేసుకొని చనిపోయినట్లు ఎస్ఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంట్లో సుభాని ఒక్కడే ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అన్నా క్యాంటిన్‌లో భోజనానికి వచ్చే వారికి అందుబాటులో అన్ని సౌకర్యాలు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్:** అన్నక్యాంటీన్లకు ఆహారం కోసం వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం అమరావతి రోడ్ లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి ఆహార నాణ్యత, క్యాంటీన్లలో వసతులు అడిగి తెలుసుకొని సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లకు నోడల్ అధికారులు ప్రతి రోజు వెళ్లి ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరు, ఇచ్చే టోకెన్లను, వసతులను పరిశీలించారు.

# బంగారంలా... దగా..!!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ప్రధానంగా బంగారంలో రాగిశాతం ఎక్కువ కలుపుతున్నారు. దాంతో ప్రజలు మోసపోతున్నారు.

**68 శాతమే బంగారం**

ఇటీవల కొంతమంది మహిళలు తమ బంగార వస్తువును కరిగించి మరో వస్తువును తయారు చేయించుకోవడం ఈ ప్రాంతంలో ఆనువాయితీగా మారింది.. ఇందుకోసం కోసం బంగారం కరిగించే వ్యక్తుల వద్దకు వెళుతున్నారు. ముఖ్యంగా బంగారం తయారీ పనుల్లో పేరుగాంచిన కంసాలి మాత్రమే అందులో ఉన్న లోపాలను వెంటనే గుర్తిస్తారు. బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో కొంతమంది మహిళలు పాత బంగారాన్ని కరిగించి కొత్త వస్తువులు తయారు చేయించేందుకు. కంసాలి వద్దకు వెళ్లగా ఆ వస్తువును చూసి కంసాలి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే అందులో 70 శాతంకు మించి బంగారం లేదు. ఆ వస్తువును విజయవాడ హాల్‌మార్క్ సెంటర్‌కు పంపి తనిఖీ చేయించగా 4 గ్రాముల బంగారంలో బంగారం శాతం 68.12రాగా, రాగి శాతం 16.47, వెండి శాతం 15.23 మాత్రమే ఉంది. దీంతో పాత బంగారాన్ని కలిగించిన మహిళలుఆ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది గతంలో ఆ వస్తువును విక్రయించిన వ్యాపారి రసీదు ఇవ్వకపోవడంతో ఆ వ్యాపారిని ప్రశ్నించే అవకాశం లేకుండాపోయింది.

**నగల తయారీలో తరుగు పేరుతో మోసం**

నగల తయారీలో తరుగు పేరుతో ప్రధానంగా మోసం జరుగుతుంది. పాత నగలు తీసుకువెళ్లి వ్యాపారికి ఇచ్చినప్పుడు అందులో 10 నుంచి 20 శాతం తరుగుతీసి 80 శాతం బంగారానికే లెక్క కడుతున్నారు. అలాగే కొత్తగా 10 గ్రాముల బంగారం వస్తువు కొనుగోలు చేసినప్పుడు అందులో నగ తయారీ సమయంలో బంగారం వృథాగా పోతుందని, తరుగు ఉంటుందని, 9 గ్రాములే లెక్కకట్టి ఇస్తున్నారు. ఇది చిన్న చిన్న దుకాణాలు మొదలు, కార్పోరేట్ దుకాణాల వరకు ఇదే పథకం ఉన్నప్పటికీ ఇక్కడే బంగారం తరుగులో మోసం జరుగుతోందని గుర్తించాలి. ప్రధానంగా బంగారు నగలలో బంగారం శాతం తక్కువగా ఉండి, రాగి శాతం ప్రమాణాలకు మించి ఉంటుందనే అనుమానాలు ఉన్నాయి. అయితే తక్షణం నాణ్యత పరీక్షించుకోవడానికి సరైన హాల్‌మార్క్ నిర్ధారిత కేంద్రం లేనందున, బంగారం ప్రమాణం నిర్ణయించలేకపోతున్నారు. కొంతమంది వ్యాపారులు ప్రయివేట్ హాల్‌మార్క్ రసీదులు ఇచ్చినప్పటికీ ఆ హాల్‌మార్క్ సెంటర్లో కూడా వ్యాపారులు చెప్పిన బంగారం శాతం నమోదు చేసి ఇస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. హాల్‌మార్క్ సెంటర్లలో కూడా అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. కొంతమంది వ్యాపారులు సిండికేట్ మారి బంగారం కొనుగోలు దారులను దగా చేస్తున్నారు గుంటూరు, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి వంటి పట్టణాల్లో కొంతమందిబడా బంగారం వ్యాపారులు సిండికేట్‌గా మారి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ ఎవ్వరికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారం పేరుతో అందరూ కలిసి వెళ్తారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టిన చందంగా ఇక్కడి వ్యాపారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి జై కొడుతున్నారు. దాంతో తమ చీకటి వ్యాపారానికి రాచబాట వేసుకుంటున్నారు. ప్రధానంగా ఇతర వృత్తులకు చెందిన వ్యాపారులు ఈ వ్యాపారంలో అడుగుపెట్టి కల్తీమయం చేశారని, కుల వృత్తిపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వృత్తిదారులు అంటున్నారు. బంగారం వృత్తిదారులు లక్షలు పెట్టుబడి పెట్టే స్థోమతలేక, భారీ భవనాలు, సెట్టింగులు, ప్రచారం, వినియోగదారులకు అప్పులు పెట్టే ఆర్థిక వెసులుబాటులేకపోవడంతో చితికిపోతున్నారు. బడా వ్యాపారుల వద్ద కూలీలుగా మారు తున్నారు. ఈ వ్యాపారంలో కల్తీచేసే కొంతమంది కోటీశ్వర్లు కాగా నమ్మకంగా వ్యాపారం చేసే కొంతమంది వ్యాపారులు దివాలా తీసిన వారు కూడా లేకపోలేదు. కొంతమంది చిరువ్యాపారులు వ్యాపారనమ్మకం పాటించడంతోనే గుంటూరు, తెనాలి వంటి పట్టణాల్లో బంగారం అమ్మకాలకు గిరాకీ ఉందని చెప్పకతప్పదు

**తూకం ఏదైనా.. మోసం అదే తీరు**

గుంటూరుకు చెందిన కొందరు స్థానికంగా ఒక బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేశారు. కొనుగోలు సమయంలో సంబంధిత ఆభరణాలలో బంగారు, రాగి శాతాలను దుకాణం వారు సూచించిన విధంగా ధరను చెల్లించారు. దుకాణం వారు చెప్పినట్లు ఆభరణాలలో బంగారు, రాగి శాతం కచ్చితంగా ఉన్నాయా? లేదా? అని పరీక్ష చేయిస్తే బిల్లులో ఇచ్చిన దానికంటే రాగి శాతం పెరిగి బంగారం తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని నిఘా విభాగం అధికారులకు ఫిర్యాదు చేసి సంబంధిత దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా కొనుగోలు దారులు నిత్యం మోసపోతున్న సంఘటనలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాధార ణంగా మారాయి. అవగాహన లేకపోవడంతో ఈ మోసాలు బహిర్గతం కావడం లేదు.

**కాటాలను మిల్లీగ్రాముల నుంచి పరీక్షించే యంత్రం**

గుంటూరు నగరంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టణాల్లో బంగారం దుకాణాలు ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక తూనికలు-కొలతలు యంత్రాలు అందుబాటులోకి వచ్చినా కొందరు దుకాణదారులు ఇప్పటికీ మోసం చేస్తూనే ఉన్నారు. బంగారం గ్రాము ధర రూ.5వేలకుపైగా ఉండటంతో వినియోగదారులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలు తగ్గినా ఆభరణాల తయారీలో వాడే బంగారం నాణ్యత, రాగి శాతం, రాళ్ల బరువు, తరుగు తదితర అంశాల్లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఐటీ ఇంజినీరుకు అనుమానం రావడంతో పరీక్ష చేయించగా రాగి, బంగారం బరువు ఎంత ఉందో కచ్చితంగా తేలింది. ఈమేరకు బిల్లుల్లో పేర్కొన్న వివరాలు సరిపోల్చి మోసం జరిగిందని గుర్తించి ఫిర్యాదు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసే వారికి అవగాహన లేకపోవడంతో ఇప్పటికీ నష్టపోతూనే ఉన్నారు. తూకం విషయమై తూనికలు, కొలతలు శాఖ ఆకస్మిక తనిఖీలు, రెగ్యులర్‌గా తూకం యంత్రాలను పరిశీలించడం ద్వారా తూకం మోసాలకు అడ్డుకట్ట పడింది. ఏడాది కాలంలో బంగారం దుకాణాల్లో వివిధ అంశాల్లో లోపాలు గుర్తించి 34 కేసులు నమోదు చేసి రూ.3.48 లక్షలు అపరాధ రుసుం విధించారు. అదేవిధంగా బంగారం దుకాణాల్లో 920 కాటాలను పరిశీలించి సరిచేశారు.

**బిల్లులు లేకుండా విక్రయాలు ....**

బంగారం కొనుగోలు చేసే క్రమంలోవినియోగదారులు వారికి సమీపంలోని పట్టణాల్లోని దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. కొందరైతే పన్నులు చెల్లించకుండా కొంత తగ్గుతుందన్న ఉద్దేశంతో స్థానిక దుకాణాల్లో బిల్లులు లేకుండా కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో వ్యాపారులు కొనుగోలుదారులను సులభంగా మోసం చేస్తున్నారు. 22 క్యారెట్ స్వచ్ఛతతో ఉన్న బంగారం ఇస్తున్నామని వ్యాపారులు చెప్పి ఆమేరకు సొమ్ము వసూలు చేస్తున్నారు. అయితే ఇది 18 నుంచి 22 క్యారెట్ల మధ్య స్వచ్ఛత ఉన్నట్లు పలు సందర్భాల్లో తనిఖీ అధికారులు గుర్తించి దుకాణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే నగరాలు, పెద్ద పట్టణాల్లో ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నా వినుకొండ, మాచర్ల, రేపల్లె, చిలకలూరిపేట వంటి పట్టణాల్లో తరచూ తనిఖీలు జరగడం లేదు. బంగారు ఆభరణాలు తయారు చేసే క్రమంలో కలుపుతున్న మిశ్రమాలు కూడా బిల్లుల్లో సక్రమంగా నమోదు చేయడం లేదు. బంగారం పరిమాణం ఎక్కువగా చూపి, రాగి, ఇతర మిశ్రమాల పరిమాణం తక్కువగా చూపి వ్యాపారులు ఎక్కువగా మోసం చేస్తున్నారు. ఒక గ్రాము బంగారం తేడా వస్తే వినియోగదారులు రూ.5వేలకుపైగా మోసపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోలుదారులు బిల్లులో సూచించిన విధంగా బంగారం, ఇతర మిశ్రమాల బరువు కచ్చితంగా ఉన్నాయా? లేదా? అని సరిచూసుకుని నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తూనికలు, కొలతలు శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒక మిల్లీగ్రాము బరువు కూడా కచ్చితంగా కాటాలు తూచే విధంగా నిబంధన అమలులో ఉంది. ఇది బంగారం దుకాణాల్లో కచ్చితంగా అమలుచేయాలి.

**అప్రమత్తతతోనే అడ్డుకట్ట**

ఒక మిల్లీగ్రాము బరువు కూడా తూచే యంత్రాలను కచ్చితంగా వాడుతున్నారో లేదో పరిశీలించాలి. మనం కొనుగోలు చేసే ఆభరణంలో రాళ్ల బరువు, నికరమైన బంగారం బరువు కచ్చితంగా తెలుసుకోవాలి. రాళ్లకు చెల్లించే సొమ్ము తక్కువగా బంగారం ధర ఎక్కువగా ఉన్నందున రాళ్ల బరువు బంగారంలో కలిపేఅవకాశమున్నందున రెండింటి బరువు కచ్చితంగా తెలుసుకోవాలి. బిల్లులో నమోదు చేసిన బరువు మేరకు ఆభరణం ఉందాలేదా చూసుకోవాలి. మనం కొనుగోలు చేసే బంగారం స్వచ్ఛత 24 క్యారెట్ నుంచి 18 క్యారెట్లలో ఏ నాణ్యత కలిగి ఉందో నిర్ధారించుకోవాలి. ఇందుకు యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. తక్కువకు వస్తుందని, మనకు తెలిసినవారే అని జాగ్రత్తలు తీసుకోకుండా బంగారం కొనుగోలు చేయడం మంచిది కాదు.



## రైస్ కార్డులో సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

జిల్లాలో రైస్ కార్డులకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన నూతన కార్డుల మంజూరు, చిరునామాల మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, విభజన, తొలగింపు , సరెండర్, అప్డేషన్ వంటి ఏడు సర్వీసుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పరిష్కరించాలని జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల 183వ వార్డు సచివాలయంలో జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ రైస్ కార్డు దరఖాస్తుల సర్వీసులను పరిష్కరిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. రైస్ కార్డుల నూతన కార్డుల మంజూరు, స్ప్లిట్టింగ్, అడిషన్, డిలీషన్ , సరెండరు తదితర సర్వీసుల దరఖాస్తులను రైస్ కార్డు మాడ్యూవల్ లో నమోదు చేసే విధానాన్ని డేటా ప్రాసెంసింగ్ సెక్రటరీ కంప్యూటరు లో జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ పరిశీలించారు. రైస్ కార్డులకు సంబంధించి వివిధ సర్వీసుల దరఖాస్తులు అందించటానికి సచివాలయంకు వచ్చిన ప్రజలతో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైస్ కార్డుల సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేసిన వెంటనే సంబంధిత కుటుంబ సభ్యుల ఈకేవైసీ చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహశీల్దారు సుభాని, సివిల్ సప్లయిస్ డీటీ భాస్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో గోల్డ్ స్మిత్, హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు వేగవంతం చేయాలన్నారు. గోల్డ్ స్మిత్ క్లస్టర్‌కు సంబంధించి డిపిఆర్ పూర్తి చేసి అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ఇందుకు సంబంధించి అనుమతి రావాల్సి వుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ ఇన్ చార్జ్ కలెక్టర్ కు తెలిపారు. సింగిల్ డెస్క్‌లో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సంబంధిత శాఖలు సక్రమంగా వెరిఫికేషన్ చేసి పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలొ సక్రమంగా పరిష్కరించాలన్నారు. పిఎంఈజిపీ కి పథకం క్రింద 41 ఎంఎస్‌ఎంఈ లు లక్ష్యం కాగా , 170 మంజూరు చేయడం జరిగిందని , ఇందులో 101 ఎంఎస్‌ఎంఈ లకు 672.68 లక్షలు మంజూరు చేసిన రుణాలు వెంటనే అందించి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ కోసం నిర్దేశిత ధృవపత్రాలను దరఖాస్తు సమయంలో అందించని ఎంఎస్‌ఎంఈ లకు అవసరమైన ధృవపత్రాలు వెంటనే అందించాలని తెలియజేయాలని, అప్పటికీ స్పందించకపోతే సంబంధిత దరఖాస్తులను తిరస్కరించాలన్నారు. జిల్లాలో 27 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్మెంట్ సబ్సీడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సీడీ, రీయింబర్స్మెంట్ ఆఫ్ పవర్ కాస్ట్ సబ్సీడీ , రీయింబర్స్మెంట్ ఆఫ్ సేల్స్ టాక్స్ సబ్సిడీ , రీయింబర్స్మెంట్ ఆఫ్ స్టాంప్ డ్యూటి సబ్సిడీకి సంబంధించి రూ.2,62,33,590/- లు మంజూరు చేస్తూ సమావేశంలో ఇన్ చార్జ్ జిల్లా కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ ఆమోదించారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ (సిఎఫ్‌సి) క్రింద మేడికొండూరు, చేబ్రోలు, తెనాలి, మంగళగిరి, ప్రత్తిపాడు మండలాల్లో 361.4 ఎకరాలు ఏపి ఐ ఏ సి భూములు లభ్యం కానందున పెండింగ్‌లో వుంచాలని ఇన్ చార్జ్ జిల్లా కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, జిల్లా భూగర్భజలవనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బీ హెచ్ మనోరమ, చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కే.రాంబాబు, కార్మిక శాఖ సహాయక కమిషనరు కృష్ణవేణి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతూకూరి ఆంజనేయులు, బిఎం ఏ పి ఎస్ ఎఫ్ సి కే.అనిత, జెడ్ ఎం ఏపిఐఏసి డాక్టర్ ఎం.ఎల్.నరసింహారావు, డిపిఓ సాయి కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ కే. శ్రీనివాస రావు, ఎస్ఎస్సీసీఐ రీజినల్ హెడ్ జి.పరిమల, ఎఫ్ఏపీఎస్ఐఏ కో ఆర్డినేటర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## విజిలెన్స్ దాడుల్లో భారీగా సిగరెట్ల పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది, జీఎస్టి అధికారుల బృందం ఈ దాడులు నిర్వహించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొన్నారు. విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు బుడంపాడు సమీపంలో ఎన్ హెచ్16 సర్వీస్ రోడ్డు ప్రక్కనగల అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్ నందలి, షాప్ నెంబర్ 33 వద్ద బీహార్ రాష్ట్రం పాట్నా నుంచి అక్రమంగా లారీ లో సిగరెట్లు వచ్చినట్లు సమాచారం అందింది. ఇక్కడికి రవాణా చేసి అన్లోడ్ చేస్తున్న సుమారు రూ.1,98 కోట్ల విలువగల సిగరెట్లను చాకచక్యంగా పట్టుకున్నారు ఎమ్మార్పీ గల జి టి పి ఎల్, ఎస్ టి ఈ పి , జి టి పి ఎల్ విమల్ సిగరెట్లను ఎలాంటి అనుమతులు లేవని గుర్తించి వాటిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నా రు. రవాణ కొరకు వినియోగించిన లారీనీ (బి.ఆర్ 01 జిఎం 9234) కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం స్టాక్ బీహార్ రాష్ట్రం నుండి సుభాష్ అనే వ్యక్తి గుంటూరు పట్టణానికి చెందిన సూర వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నట్లుగా నిర్ధారించారు. సూర వెంకటేశ్వరరావు తో పాటు అతని అనుచరుడు నిరంజన్ అనే వ్యక్తిని, లారీ డ్రైవర్ ధరం దేవ్, బీహార్ కు చెందిన సుభాష్ లపై చర్యల నిమిత్తం స్థానిక పాత గుంటూరు పోలీస్ స్టేషన లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని విజిలెన్స్ ఆదేశించింది.

# స్వయం ఉపాధితోనే స్త్రీ శక్తి..

- మహిళల అభివృద్ధికి కృషి చేస్తాము
- కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి..






**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** స్వయం ఉపాధితోటనే సమాజంలో స్త్రీ శక్తి ఇంకా బలపడుతోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బీసీ కార్పోరేషన్ ద్వారా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే జూలకంటి శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మహిళలకు ఎన్ని రకాల కోర్సులు అందిస్తున్నారో ట్రైనర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్వావలంబన, సాధికారిత చేకూర్చినప్పుడే మహిళలకు సమాజంలో గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళా లోకం ఆర్థికంగా పురోగమించేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని వివరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో ప్రభుత్వం ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లను అందజేస్తుందని తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

- గంగమ్మ తల్లి తిరునాళ్ళలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి.



**దుర్గి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్యామరాజుపురం గ్రామంలో కొలువైన శ్రీ గంగమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని.., అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చక బృందం, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు అనంతరం వేద ఆశీర్వచనాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. తరువాత ఆలయ ప్రాంగణంలోని పొంగళ్ల షెడ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే.., ఆలయ అభివృద్ధికి కావలసిన మౌలిక వసతులను గ్రామ పెద్దలంతో గ్రామ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విదేశీ వైద్య విద్యార్థులకు ఐఎంఏ బాసట

**గుంటూరు మేజర్ న్యూస్:** గత కొన్ని నెలలుగా విదేశాలలో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యకు కారణాలు అధ్యయనం చేసిందని, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్‌శాఖ ఈ విద్యార్థులకు బాసటగా నిలుస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నందకిషోర్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ గత ఐదు సంవత్సరములుగా కోవిడ్ 19, రష్యా యుక్రెయిన్ యుద్ధం వంటి ప్రపంచంలో నెలకొన్న అసాధారణ పరిస్థితులు ఈ విద్యార్థులను గందరగోళ పరిస్థితికి నెట్టాయన్నారు. దీనికి తోడు పది నెలలుగా ఆంధ్రప్రదేశ్ వైద్యమండలి పూర్తిస్థాయిలో ఏర్పాటు కాకపోవటం కూడా ఒక కారణంగా ఉందని, ఇప్పుడు ఒక స్థాయికి వైద్య మండలి ఏర్పడినందున ఈ సమస్యను సత్వరమే పరిష్కరించవలసి వుందన్నారు. ఈ అసాధారణ పరిస్థితులను నివృత్తి చేసే విధంగా నేషనల్ మెడికల్ కమిషన్ అనేక మార్గదర్శకాలను రాష్ట్ర మండళ్లకు సూచించటం జరిగిందన్నారు. ఈ మార్గదర్శకాలను మదింపు చేసిన మన పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ ఝార్కండ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాలు తగు చర్యలతో విద్యార్థులకు వైద్య మండలి నమోదు ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేసాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ఒక సంవత్సరంగా ఉన్న ఇంటర్నషిప్ ఆంధ్రప్రదేశ్లో మాత్రం అంతకుమించి రెండు మూడు సంవత్సరాలుగా విధించటం విద్యార్థులకు విద్యా సంవత్సరాలు నష్టపోయే విధంగా వుందన్నారు. ఇప్పటికీ దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం శోచనీయనీ ఇటీవల డా. శ్రీహరి రావు నాయకత్వంలో వైద్య మండలి ఏర్పడిన వెంటనే దీనిపై చర్యలు మొదలవడం ముదావహం అన్నారు. తాజాగా ఈ నెల 1వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ బీహార్ వైద్య మండలికి రాసిన లేఖలో 'ఇంటర్న్ షిప్ దాని సంబంధిత విషయాలు రాష్ట్ర మండళ్ల పరిధిలోనివని' చేసిన సూచనను పరిగణలోనికి తీసుకొని వెంటనే ఈ వివాదానికి తెరదించాలని, రాష్ట్ర వైద్య శాఖామాత్యులు, కార్యదర్శి, వైద్య విద్యా సంచాలకులు చొరవ తీసుకుని ఈ విద్యార్థులకు మరింత నష్టం జరగక ముందే తగిన దిశానిర్దేశం చేయవలసిందిగా ఐఎంఏ అభ్యర్థిస్తుందనీ డాక్టర్ నందకిషోర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రజా సమస్యల ప్రజావేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. చదలవాడ

**నరసరావుపేట మేజర్ న్యూస్ :-** నరసరావుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజావేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డా"చదలవాడ అరవింద బాబు నియోజకవర్గంలోని ప్రజల వద్ద నుండి వినతి పత్రాలను అందుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గం టీడీపీ కార్యాలయం నందు ప్రజల సమస్యలు తెలుసుకొనుటకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నామని ప్రజా వద్ద నుండి పెద్ద ఎత్తున వినతి పత్రాలు వస్తున్నాయని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారుల ద్వారా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు వచ్చే నెల నుండి రైతులకు 20.000/- రూపాయల ఆర్థిక సహాయం



స్కూల్ వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద 15,000/- రూపాయలు అందించనున్నారని ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం అందించి పక్క గృహాలు కట్టిస్తామని ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ఎమ్మెల్యే తో కలిసి ప్రజల వద్ద నుండి అర్జీలను అందుకున్నారు.

# ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగా యాత్ర ర్యాలీ

**పెదకాకాని,మేజర్ న్యూస్ :-** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా హెల్ప్ ఫౌండేషన్ ( సత్తెనపల్లి ) వారి ఆధ్వర్యంలో ఎంజీఎస్ ఐటిఐ విద్యాసంస్థ విద్యార్థులు తక్కెళ్ళపాడు కాలేజ్ నుండి ఉప్పలపాడు సెంటర్ వరకు 100 మీటర్ల జాతీయ జెండాతో జాతీయ జెండాలతో తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌరవనీయులు పెద్దలు ఎంజీఎస్ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ టీ ఇమ్మానియేల్ ప్రారంభించి మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని చేపట్టి పాకిస్తాన్ ఉగ్రవాదులను ఊచ కోత కోసిన భారతదేశ త్రివిధ దళాలకు మద్దతుగా వారి పోరాట పటిమకు సేవలకు సంఘీభావంగా తిరంగా యాత్ర చేపట్టడం జరిగిందని భారతదేశ గొప్పతనాన్ని ఔన్నత్యాన్ని విద్యార్థులు కూడా చిన్ననాటి నుంచి తెలుసుకొని భారత దేశ పౌరులుగా భారతీయులుగా గర్వపడాలని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రతి భారతీయుడు తల ఎత్తుకొని గర్వించేలా త్రివిధ దళాలు పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడులు చేశాయని ఆ క్రమంలో భారత దేశ సైనికులు కూడా కొంతమంది చని పోయారని వారి త్యాగమును గుర్తు చేసుకుంటూ వారి పోరాటాన్ని మదిలో నింపుకొని ప్రతి ఒక్క భారతీయుడు మది నిండా నింపుకోవాలని అన్నారు. విద్యార్థులు భారత మాతాకీ జై ఆపరేషన్ సింధూరంలో వీర మరణం పొందిన అమరవీరులకు జోహార్లు అంటూ స్లొగన్స్ చెప్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సేవ సంస్థల, ప్రతినిధులు, ఉద్యోగులు,గ్రామ ప్రజలు, విద్యార్థులు, చిన్న పెద్ద తేడా లేకుండా పాల్గొని భారత మాతాకీ జై అమర జవాన్లకు జోహార్లు అంటూ యువత ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా తిరంగా యాత్ర ర్యాలీలో పాల్గొన్నారు.





# ఆర్.వి.ఆర్ & జె.సి విద్యార్థులకు ఉద్యోగ అవకాశం

**గుంటూరు, మేజర్ న్యూస్:**

ఫార్మాస్యూటికల్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా తమ కళాశాల నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగ 13 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం ఆనందదాయకమని, ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇప్పటి వరకు 822 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందారని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్ల మూడి మురళీ మోహన్, డా. జగదీష్ కె. పేర్కొన్నారు. ఉద్యో గాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. తమ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న కంప్యూటర్ కోర్స్ విద్యార్థులతో పాటుగా కోర్ ఇంజనీరింగ్ కోర్స్ విద్యార్థులకు కూడా ప్రసిద్ధి చెందిన కంపీనీలలో మంచి ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు ప్రాంగణ ఎంపికలలోనే లభించడం తమ కళాశాల అందిస్తున్న ఉన్నత విద్యా ప్రమాణాలకు నిదర్శనమని కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ అండ్ ఆర్&డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర



మాట్లాడుతూ గ్రాన్యూల్స్ ఇండియా కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగ 13 మంది విద్యార్థులకు 3 లక్షల రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయని మరికొన్ని కంపినీల నుండి ఉద్యోగ నియామక పత్రాలు రానున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాసరావు, కెమికల్ ఇంజనీరింగ్ విభాగ ఇంచార్జి విభాగాధిపతి డా.కె.రమేష్ చంద్ర, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సి. హెచ్. శ్రీనివాసరావు, డా.కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.

## ఏపీజీఈఎ రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులు తరలిరండి



**తెనాలి, మేజర్ న్యూస్:**

జూన్ 5న విజయవాడలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆహ్వానించామని, కావున తెనాలియూనిట్, దుగ్గిరాలయూనిట్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మికులందరు హాజరై సభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఉన్న సహకారశాఖ ఉద్యోగులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరిం చారు. కార్యక్ర మంలో తెనాలియూనిట్ ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి కారుమూరు కమల కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దగ్గుబాటిసుధీర్, ఉపాధ్యక్షులు దీపాలశ్రీనివాసరావు, షేక్ అన్వర్, దుగ్గిరాల యూనిట్‌అధ్యక్షులు అందెబాలచంద్రమౌళి, మరియు కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## ఆచార్య సింహాచలంకు రాష్ట్ర అత్యున్నత జీవవైవిధ్య పురస్కారం



**ఏ ఎన్ యు/ పెదకాకాని మేజర్ న్యూస్ :**

ఏ ఎన్ యు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ బయోడైవర్సిటీ కన్సర్వర్ అవార్డును అందుకున్నారు. జువాలజీ,జీవవైవిధ్య సంరక్షణ రంగాలలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బయోడైవర్సిటీ బోర్డు ఈ అవార్డు ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. రాష్ట్ర పర్యావరణ శాఖామాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆచార్య సింహాచలం ఈ అవార్డును స్వీకరించారు.రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ఆచార్య సింహాచలంను వర్సిటీ అధికారులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు. జీవవైవిధ్య సంరక్షణలో ఆయన చేసిన కృషి ఎంతో మందికి ఆదర్శప్రాయమని వారు కొనియాడారు.

## ఏపీలో యథావిధిగా డీఎస్సీ షెడ్యూల్ స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

**గుంటూరు, మేజర్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ, టెట్‌కు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే విడుదలైన డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా వేయాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని అభిప్రాయపడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఏవైనా సమస్యలు ఉంటే హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం సూచించింది. టెట్, డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేసింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు సీబీటీ విధానంలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## మద్యం షాపుల ఆకస్మిక తనిఖీ



సత్తెనపల్లి మేజర్ న్యూస్: పట్టణం పరిధి, మండలం, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల పరిధి గ్రామాలలో ఉన్న ప్రైవేటు మద్యం షాపులను సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పి.విజయ్ కుమార్, ఎస్ ఐ కె. నాగ లక్ష్మీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. షాపుల సమయపాలన పై పెట్రోలింగ్, ఎం ఆర్ పి ధరల అమలు పై ఆకస్మిక తనిఖీ నిర్వహించగా ఎటువంటి అక్రమాలు లేవన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సి ఐ పి విజయ్ కుమార్ హెచ్చరించారు.

## టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు ఏకగ్రీవం



**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:**

నరసరావుపేట మండలం టీడీపీ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం పార్టీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడిగా దొండపాడుకు చెందిన బండారుపల్లి విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శి షేక్.మాబు సుభాని(చిన్న తురకపాలెం), ఉపాధ్యక్షుడు శిఖనం అమర్నాథ్(కేసనపల్లి)లతో పాటు కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఈసందర్భంగా నూతన కమిటీకి పలువురు టీడీపీ నేతలు అభినందనలు తెలియజేశారు. మండల కమిటీకి తమ పేర్లు సిఫార్సు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నరసరావుపేట మండ లంలో పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు.

## మంగళగిరిలో రూ. 9 లక్షల 55 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

### - మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో చెక్కులు పంపిణీ చేసిన స్థానిక నాయకులు



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి మండలం ఆత్మకూరులో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.9 లక్షల 55 వేల విలువైన చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన పులివర్తి అభిరామ్‌కు రూ.6,04,282 లక్షలు, మన్యం బాలాజీకి రూ. 3,01,700 లక్షలు, వెలవల వరలక్ష్మికి రూ. 49,324 వేల విలువైన చెక్కులను బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఆయా కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతోనే ఎప్పుడు లేని విధంగా లక్షల విలువైన నిధులను సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిది సీఎం సహాయనిధి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని, లక్షల ఖర్చు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్‌ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, గ్రామ పార్టీ అధ్యక్షులు తాటి వెంకట్రావు, మండల కమిటీ ఉపాధ్యక్షులు కొమ్మాసుకుమార్, శానం మాణిక్యరావు, మన్యం సుబ్బారావు, మోతుకూరి రవి, కొండపల్లి మధుబాబు, గద్దె రామస్వామి, మాన్యం ఏడుకొండలు, ఎర్రమల లాజర్, అల్లూరి శీను, జాలాది రవి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే జూలకంటి

- శిరిగిరిపాడులో వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి
- క్రీడా ఆశయంతో యువత ముందకెళ్లాలి
- బహుమతుల ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే జూలకంటి..

**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**
మండల పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించు కుని గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పురుషులు, మహిళల వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్స్ గురువారం రాత్రి హోరాహోరిగా సాగింది. ఈ పోటీలో గెలిచిన విజేతలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదిగా బహుమతుల ప్రధానం జరిగింది. ఫైనల్ విజేతలు గా నిలిచిన ఎస్.ఆర్.ఎం పురుషుల జట్టుకు రూ. లక్ష నగదు, మెడల్స్, ట్రోఫీని అందజేశారు.







అదేవిధంగా మహిళా విభాగంలో విజేతలుగా నిలిచిన ఎస్ఆర్ఎం మహిళా జట్టులకు రూ. 75 వేల నగదు, మెడల్స్ ట్రోఫీని అందజేశారు. పురుషుల విభాగంలో రన్నర్ గా నిలిచిన ఐ.వో.బీ జట్టు, మహిళా విభాగంలో సదరన్ రైల్వే జట్లకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్నాడు ప్రాంతం క్రీడా విభాగంలో అభివృద్ధి పథంలో ముందుకు నడవాలంటే.. యువతలో క్రీడా ఆశయం పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా నాలుగు రోజులు పాటు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ఉన్నతమైన విలువలతో సాగిందని, ఎటువంటి ఆటంకాలు లేకుండా టోర్నమెంట్ ను నిర్వహించిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో అన్నవితరణ




**సత్తెనపల్లి మేజర్ న్యూస్:**
పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆద్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకం 55 వ సారి శుక్రవారం జరిగింది. దాత శెట్టి అమరవాణి మనవడు నవనీత్ కుమార్ తల్లిదండ్రులు వెంకట గోపి సునీత పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహా యంతో 140 మంది రోగులకు, రోగుల సేవకులకు స్వీట్, హాట్‌తో పాటు ఉచితంగా భోజనం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోతుగంటి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పేరుతో జనసేన నాయకులు అప్పాపురపు నరేంద్ర ఈ కార్యక్రమానికి రూపకల్పన గావించి నిస్వార్ధంగా చేస్తున్న సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్న నరేంద్ర అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో భవాని, నర్సింగ్ సూపర్నెంటు రాధ, సూరె రామకోటేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, కటకం కాశీ విశ్వనాథం, పులిపాటి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో జనసేన ప్రధాన కార్యదర్శిపై దాడి

## దరువూరీ దాడి చేయించినట్లు ఆరోపణ



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :**
పట్టణానికి చెందిన జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వ్యవస్థీకృత మార్పు కోసం అవినీతిపై పోరాటం చేస్తూనే ఉన్నాను, దివంగత నేత కోడెల శివప్రసాద్, మంత్రి అంబటి రాంబాబు హయాంలో కూడా పోరాటం చేశాను. అవినీతి కార్యక్రమాలు ఆధారాలతో సహా రుజువు చేశాను ఎన్నో కార్యక్రమాలు చేశాను. గతంలో ఎప్పుడూ కూడా ఇలా భౌతికదాడికి దిగలేదు. నా ఫేస్బుక్ ఫేక్ ఎకౌంటు క్రియేట్ చేసి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎనిమిది మంది మహిళలు వచ్చారు. కన్నా లక్ష్మీనారాయణను విమర్శిస్తున్నావని పోస్టులు పెడుతున్నావన్నారు. నేను పెట్టలేదు ఎప్పుదు విజ్ఞప్తి చేశానాని అన్నాను. ఇది కన్నా లక్ష్మీనారాయణ తెలిసి జరిగిందని నేను భావించడం లేదు. ఆయన పక్కన వాళ్ళు పేరు వాడి, చేస్తున్నారు. ఎవరో కాదు దరువురి నాగేశ్వరావే, ఆయన మీద గతంలో నేను కొన్ని ఆరోపణలు చేశాను. ఒక మహిళ మరొకతను విచక్షణారహితంగా చేతులతో, కుర్చీలతో రాగి బాటిల్లతో కక్షకొద్ది ఎవరో కొట్టమన్నట్లుగా నాపై దాడి చేశారు. నాకు రక్తపు గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్ కి వెళ్లాను. సిఐ గారు దాచేపల్లి వెళ్లారని వస్తారు కూర్చోమన్నారు. నేను కూర్చోలేని పరిస్థితులు ఆసుపత్రికి వచ్చాను. ఇది దుర్మార్గమైన విషయం. మా కూటమి అనుకునే ప్రభుత్వంలో జరగటం బాధాకరం.

# సత్తెనపల్లి పలు షాపుల్లో

## తూనికలు - కొలతల శాఖ అధికారుల తనిఖీలు

- 4 కేసులు నమోదు చేసిన అధికారులు



**సత్తెనపల్లి మేజర్ న్యూస్:**
పట్టణంలోని గార్లపాడు బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల సంగం డైరీ పార్లర్ పై, ఫిరంగిపురంకు చెందిన ఓ వ్యక్తి బటర్ మిల్క్ ప్యాకెట్ అధిక ధరకు అమ్ముతున్నా రని ఎన్ హెచ్ ఎం ఎస్ కు ఫిర్యాది చేశారని తూనికలు -కొలతల శాఖ అధికారి సైదా తెలిపారు. దానిపై విచారణ చేశామని, అధిక ధరకు అమ్మినట్లు, అంతేకా కుండా పార్లర్ లో దోసె పిండి ప్యాకెట్స్ ప్రజలకు అమ్ముతున్నారని, వాటిపై ప్యాకింగ్ తేదీ, చిరునామా, అడ్రస్ వంటివి లేనట్లు గుర్తించామని, వాటిని ప్రజలకు అమ్మరాదని యజమానికి సూచిస్తూ వాటిని తొలగించా మన్నారు. గడియార స్తంభం సెంటర్ వద్ద హోల్ సేల్ చాక్లెట్స్ దుకాణాల్లో నవరత్న ఆయిల్ 85 ఎంఆర్పీ పై 5 రూపాయలు కలిపి 90 రూపాయలు తీసుకున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంక్వైరీ చేసి కేసు నమోదు చేశామని వివరించారు. చిన్న పిల్లలు తినే చాక్లెట్స్ డబ్బాలు ఎక్స్పైరీ తేదీ,పూర్తి వివరాలు లేనట్లు గుర్తించామన్నారు. సంగం డైరీ పార్లర్ నిర్వాహకులు, ఫాన్సీ దుకాణ దారులపై 4 కేసులు నమోదు చేసినట్లు 18 మండలాల తూనికలు -కొలతల శాఖ అధికారి సైదా తెలియజేశారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు వాటిపై చిరునామా అడ్రస్, ఎక్స్పైరీ తేదీ, కస్టమర్ కేర్ అడ్రెస్ పూర్తి వివరాలు, వాటి తూకం ప్రతి ఒక్కటి కొనుగోలుదారులు గుర్తించాలని, దుకాణదారులు ఏదైనా మోసం చేశారని గ్రహిస్తే మా శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన ప్రజలకు సూచించారు.

# దేశీయ జల మార్గాలు జల రవాణాకు అనుకూలం

- అనుసంధానంతో యువతకు మరిన్ని ఉద్యోగాలు
- దేశ ఆర్థిక వ్యవస్థలో జల రవాణా కీలక పాత్ర వహిస్తుంది
- జల రవాణాలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి
- డాక్టర్. జెడ్. శివప్రసాద్, చైర్మన్, ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ

**గుంటూరు, మేజర్ న్యూస్**
రాష్ట్రంలో జల మార్గాల అనుసంధానంతో జల రవాణా సులభతరం అవుతుందని అందుకు నా వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ జెడ్. శివప్రసాద్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ గా డాక్టర్ జెడ్. శివప్రసాద్ శు క్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో సంస్థ కార్యాలయంలో సంస్థ సీఈవో జీవీ. రాఘవరావు సమక్షంలో పదవీ బాధ్య తలు స్వీకరించారు.. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజనరీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాకు మార్గదర్శి ఐటీ, విద్యా శాఖ ల మంత్రి నారా లోకేష్ లు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు ఇవ్వటం సంతోషంగా ఉందని, అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా న్నారు. జల రవాణా లాంటి మంచి ప్రాజెక్టు బాధ్యతలను నాకు ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. నా శక్తి వంచన లేకుండా ఇందుకు పనిచేస్తా న్నారు. తక్కువ ఖర్చుతో దేశీయ జల మార్గం ద్వారా రవాణా, కార్గో చాలా సులభతరం అవతుందన్నారు. జల మార్గంతో రవాణా చేయడం వల్ల రోడ్లపై ట్రాఫిక్ తగ్గుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్రంలో 960 కి.మీ ల పొడవు గల సముద్ర తీర ప్రాంతం ఉందని జల రవాణాకు ఇది ఎంతో అనుకూలమన్నారు. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో జల రవాణా కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. సాగరమాల ప్రాజెక్టుకు అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. పాశ్చాత్య దేశాలు జల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. జల రవాణాలో ఉన్న ఇబ్బందులను తొలగించి సంస్థను పురోభివృద్ధిలో పయనించేలా కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నానన్నారు. రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రోత్సాహంతో సంస్థను ముందుకు తీసుకెళ్లతామన్నారు. పోర్టు లు అనుసంధానం ద్వారా మరిన్ని ఉద్యోగాలు యువత కు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీని పై దృష్టి పెట్టటం సంతోషంగా ఉందన్నారు. జల రవాణా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వానికి నావంతు సహకారం అందిస్తానన్నారు.. జల రవాణాలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని డాక్టర్. జెడ్. శివప్రసాద్ తెలియజేశారు.



# నాణ్యమైన సన్న బియ్యంతోనే అవినీతికి అడ్డుకట్ట

## - జనచైతన్య వేదిక సభలో వక్తలు




గుంటూరు మేజర్ న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ లో రేషన్ బియ్యం లో అవినీతిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ మాదిరిగా నాణ్యమైన సన్నబియ్యాన్ని రేషన్ కార్డు గల లబ్ధిదారులకు అందించాలని, బియ్యంతో పాటు రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు లాంటి వాటిని అందించాలని ,కేరళ మాదిరిగా ప్రజలకు మూడు రకాల కార్డులు అందుబాటు లో ఉంచాలని ఒక కార్డు రేషన్ బియ్యం కోసం, మరొక కార్డు సంక్షేమ పథకాల కోసం, మూడవ కార్డు ఇతర అవసరాల కోసం వినియోగించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 3 కార్డుల విధానాన్ని అమలు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థలో కేవలం బియ్యం మాత్రమే కాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా వివిధ రకాల నిత్యవసర వస్తువులను కూడా అందుబాటులో ఉంచాలని జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో రేషన్ బియ్యం లో అవినీతి - పరిష్కారాలపై జరిగిన చర్చా గోష్టిలో వక్తలు తెలిపారు. చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సిపిఐ సీనియర్ నేత మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్ ప్రసంగిస్తూ కేరళ లో 16 రకాల సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారని, తమిళనాడులో 7,8 రకాల వస్తువులు అందిస్తున్నారని తెలిపారు. జీవన శైలిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా చిరుధాన్యాలను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో, ప్రజా సంఘాలతో, మేధావులతో చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో 1.6 కోట్ల కుటుంబాలు ఉండగా వారిలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కాసులు కురిపించే వ్యవస్థగా మారిందన్నారు. దాదాపు 80శాతం మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న దొడ్డు బియ్యాన్ని తినడం లేదని, కేజీ 10 రూల నుండి 15 రూలకు దళారీలకు అమ్ముతున్నారన్నారు. అత్యధిక అధికార పార్టీ ఎమ్మెల్యేలు మండలానికి ఒక ఏజెంటును నియమించుకుని వారి ద్వారా ప్రతినెలా 20 లక్షల రూపాయలు తీసుకుంటున్నారని 5 సంవత్సరాలలో 12 కోట్ల రూపాయల అవినీతికి లోనవుతున్నారన్నారు. ఇలాంటి అవినీతిని నిర్మూలించడానికి లబ్ధిదారులకు నాణ్యమైన సన్న బియ్యంతో పాటు చిరుధాన్యాలను అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు నెలలుగా నాణ్యమైన సన్న బియ్యాన్ని రేషన్ కార్డు లబ్ధిదారులకు, హాస్టళ్లకు, అంగన్వాడి కేంద్రాలకు మధ్యాహ్న భోజన పథకానికి అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రసంగిస్తూ రేషన్ బియ్యం లో అవినీతి, నగదు బదిలీ పథకం ద్వారా పరిష్కారం కాదని నాణ్యమైన నిత్యవసరాలు అందించడమే సరైన మార్గం అన్నారు.

రేషన్ షాపులతోపాటు బియ్యం పంపిణీ వాహనాలు కూడా కొనసాగించడం ద్వారా వృద్ధులకు, వికలాంగులకు తోడ్పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్ ప్రసంగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 29వేల రేషన్ షాప్స్ ఉన్నాయని, వాటిని మరింత పటిష్ట పరిచి మినీ సూపర్ బజార్లుగా మార్చాలన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటా ఆంజనేయులు ప్రసంగిస్తూ నాణ్యతలేని తినడానికి వీలుకాని బియ్యాన్ని రాష్ట్రప్రభుత్వం అందించడం ద్వారానే అవినీతికి, దళారి వ్యవస్థకు దారి తీస్తుందన్నారు. కరోనా సమయంలో రేషన్ షాప్ డీలర్లు పేదలకు అండగా నిలిచారన్నారు. వేలాది మంది అనర్హులకు కూడా తెల్ల కార్డులు ఉండటం సమస్యగా మారిందన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ ఎన్నికలలో ఓట్ల లబ్ధి కోసం విరివిరిగా రేషన్ కార్డులను పంపిణీ చేశారని, చౌక బియ్యం అవసరం లేని వారికి కూడా తెల్ల కార్డు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో 95శాతం కుటుంబాల వద్ద తెల్ల కార్డులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హుల వద్ద ఉన్న తెల్ల కార్డులను తొలగించాలని కోరారు.

ఈ చర్చా గోష్టిలో అధ్యాపకులు కె. జగదీష్, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చావా శివాజీ, నల్లబోతు సాంబశివరావు, ఆలా అనంత రామయ్య, జనవిజ్ఞాన వేదిక నేత గోరంట్ల వెంకటరావు తదితరులు ప్రసంగించారు.

---

# రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలపై దృష్టి పెట్టాలి

## సామాజికవేత్త జాతీయ క్రైస్తవ నాయకులు డాక్టర్ గోళ్ళమూడి ప్రభుత్వానికి విజ్ఞప్తి



**గుంటూరు,రూరల్ మేజర్ న్యూస్:**

రాష్ట్రంలోనూ దేశంలోనూ క్రైస్తవులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, క్రైస్తవ పాస్టర్లను చంపేస్తున్నారని, మతోన్మాదులు చర్చిలోకి వెళ్లి చర్చిలలో అలజడి సృష్టిస్తున్నారని, పట్టణాలలో క్రైస్తవ మిషనరీల కాలంలో ఏర్పడిన సమాధులన్నీ మృతదేహాలతో నిండిపోయాయని, క్రైస్తవులు మృతదేహాలను ఖననం చేసేందుకు కోసం అంగుళం భూమి కూడా లేదని, క్రైస్తవులకు రక్షణక ప్రత్యేక చట్టం పాస్టర్ ప్రవీణ్ పేరున చేయాలని, డాక్టర్ గోళ్ళమూడి తన ప్రసంగంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. గత రెండు నెలలుగాపాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పై ఉన్నత స్థాయి విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పలు వినతులు ఇచ్చినట్లు, ప్రభుత్వంలో కూడా ఒక ఫైల్ సర్కులేట్ అయిందని, దానిపైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక నిర్ణయాన్ని అవసరం లేకుండా చేయాలని దీని విషయంలో పాస్టర్లు అందరితో సమాసం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడాలని డాక్టర్ గొల్లమూడి విజ్ఞప్తి చేశారు. మే నెల 23న, సాయంత్రం గుంటూరు బ్రాడీపేట లోని ఎల్ఈఎం హై స్కూల్ గ్రౌండ్ లో జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్ధనా సభలో డాక్టర్ గొళ్ళమూడి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, గుంటూరు నగరమై కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలలోనూ క్రైస్తవ సమాధులకు భూ సమస్య ఎక్కువగా ఉందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని డాక్టర్ గోళ్ళమూడి అన్నారు. ఏ ఈ ఎల్ సి పాస్టర్లు బిషప్పులు పాస్టర్ ప్రవీణ్ పగడాల సువార్త విషయంలో చేసిన సేవలను కొనియాడారు. దేశంలో దైవ సేవకులకు అందరికీ , పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆదర్శప్రాయుడని, సువార్త వ్యాప్తికి అవసరమైన ఆర్థిక వనరులను తను సొంతంగా సాఫ్ట్వేర్ కంపెనీలను స్థాపించి వాటిల్లో కొన్ని వందల మందికి యువతకు ఉద్యోగాలు కల్పించి, అనాధలకు తల్లితండ్రులు కోల్పోయిన వారికోసం హాస్టళ్లు విద్యాలయాలు స్థాపించి అనాధలు అభ్యున్నతి కోసం పాటుపడ్డారని దేశవ్యాప్తంగా కోట్ల మంది క్రైస్తవులు హిందువులు ముస్లింలను సువార్త వైపు కదిలించారని ఆయన సేవలను వేనోళ్ల పొగడారు. అన్నిమతాల గ్రంథాలను లోతుగా అధ్యయనం చేయుట కోసం తానుగా కష్టపడి అరమిక్, హీబ్రూ, గ్రీకు, సాంస్కృత భాషలను నేర్చుకొని, యదార్థాలను దేశ ప్రజలకు బోధించారని ఇటువంటి పని చేయడం చాలా అరుదని, తాను నమ్మిన విషయాలను తాను ఏనాడు వెనకంజు వేయకుండా బోధించారని ప్రసంగించారు. ముందుగా ప్రార్ధనా కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆరుమళ్ళ మార్కు నిర్వహించారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు సభా పరిచయము గావించారు.

మూడు జిల్లాల నుండి వచ్చిన ఆర్ సి ఎం, ఏ ఈ ఎల్ సి, బాప్టిస్ట్, సి ఎస్ ఐ, యూపీఎఫ్, ఈపీఎఫ్, జిపి ఎస్, విజయుడు, సాల్వేషన్ ఆర్మీ , లకు చెందిన మండల, నియోజకవర్గం అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొని ప్రసంగించారు.ప్రసంగించిన వారిలో ప్రధానంగా, ఆర్ సి యం బిషప్ చిన్న బత్తిని భాగయ్య, ఏ ఈ ఎల్ సి గుంటూరు సిన్నడు ప్రెసిడెంట్ రెవరెండ్ బాబురావు, వెస్ట్ పారిస్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ జి సతీష్ బాబు, ఈస్ట్ పారిస్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ బి చక్రధరరావు, తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ జి గాబ్రియల్, ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ పాస్టర్ ఎన్ ఇమ్మానుయేల్ లుకలరు..

క్రిస్టియన్ వివాహ చట్టాలు, భారత రాజ్యాంగం తదితరాలపై త్వరలోనే పాస్టర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆరుమళ్ళ మార్కు, మద్దు ప్రేమ జ్యోతి బాబు, ఇమ్మానుయేలు సభలో ప్రకటించారు.జూన్ 23వ తారీఖున, పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం, పెదమక్కెన గ్రామంలో క్రైస్తవులు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్రైస్తవ ముస్లిం ప్రజలతో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి ప్రకటించారు.వందన సమర్పణను జాతీయ దళిత క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ సభా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు.తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని ఆమె తెలిపారు.

## నారాకోడూరులో కేంద్ర బృందం పర్యటన



**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** శుక్రవారం మండలంలోని నారాకోడూరులో కేంద్ర బృందం పర్యటించారు. డిజిటల్ / స్మార్ట్ విలేజ్ చొరవతో నారాకోడూరు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ ఉమాదేవి తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కేంద్ర ప్రభుత్వం టెలి కమ్యూనికేషన్ డైరెక్టర్లు పీవీ ప్రవీణ్ డైరెక్టర్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్. కేఎస్ నేల్తా డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ అతిక్యు అహ్మద్ డైరెక్టర్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్. ఆరాధ్య స్లామ్ పాల్గొన్నారు. జాతీయస్థాయి సమృద్ధి విలేజ్ ఎంపికలో మూడు గ్రామాలను ఎంపిక చేయగా నారాకోడూరు ఒక గ్రామం ఎంపిక చేయటం జరిగింది. దానిలో భాగంగానే క్షేత్రస్థాయిలో గ్రామాన్ని సందర్శించడం జరిగిందని కేంద్ర బృంద సభ్యులు అన్నారు. తొలుత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారా కోడూరులో భాగస్వామ్య అభివృద్ధి శాఖలు వైద్య శాఖ , వ్యవసాయం శాఖ , విద్యా శాఖ , వ్యవసాయ శాఖ , ప్రాథమిక వ్యవసాయ సొసైటీ, స్వయం సహాయక సంఘాలు , గ్రామ సచివాలయ సేవలు కు సంబంధించిన జిల్లా అధికారులు మండల అధికారులు గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల కు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాకోడూరు గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి పరిశీలించారు. అలానే వేజెండ్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, ఈ అన్నపూర్ణ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి శాంత కుమారి , ఏ డి అగ్రికల్చర్ రామకోటేశ్వరి , కె.వి రామారావు డి ఎల్ సి ఓ , జి ఎస్ డబ్ల్యూ ఎస్ మోహన్ రెడ్డి , ఎంపీడీవో ఏ ఉమాదేవి తహసిల్దార్ కె శ్రీనివాస శర్మ ఈవో పిఆర్ అండ్ ఆర్ డి టి ఉషారాణి ఏపిఎం శ్రీలక్ష్మి ఇతర మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

### వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య**

స్థానిక కొత్తపేట శ్రీ శ్రీ శ్రీ అభయ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు హనుమాన్ జయంతి మహోత్సవ భాగంగా పోతురాజు రామకృష్ణ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ప్రారంభించారు. మొదట ధర్మచరణ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల నుంచి ఆశీర్వాద స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ ఇప్పటి కాలంలో ప్రజలు వారి పనులతో ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారని దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం వలన ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. మనకు అందుబాటులో ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా చేయూతనివ్వాలన్నారు. అన్ని దానాల్లో కల్లా అన్నదానం మహా పుణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు శ్రీనివాసరావు, పోతురాజు చంద్రశేఖర్, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, తోట రంగారావు, గాజుల సాయిరాం, గుబ్బటి బాలసుబ్రమణ్యం, తేలప్రోలు వెంకట్రావు,ఆవ్వరి మురళి, ఆర్ఎస్ఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ముందే పలకరించిన తొలకరి..!

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

- పదహారేళ్ల తర్వాత ముందస్తు ఋతుపవనాలు ప్రవేశం!
- మరో రెండు రోజుల్లో రాష్ట్రంలోకి విస్తరించనున్న నైరుతి
- 26న రాయలసీమలోకి రుతుపవనాలు
- 29 నాటికి ఈ ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం
- సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం

పదహారేళ్ల తర్వాత.. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా రాష్ట్రాన్ని పలకరిస్తున్నాయి. భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అంచనాలకు అనుగుణంగానే వారం ముందుగా.. ఈ నెల 26 నాటికి రాయలసీమలోకి ప్రవేశించనున్నాయి. 29 నాటికి రాష్ట్రమంతటా విస్తరించే సూచనలున్నాయి. మే నెలాఖరులో రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడం 2009 తర్వాత ఇదే మొదటిసారని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు, ఎల్‌నినో ప్రభావం లేకపోవడం రుతుపవనాల ముందస్తు రాకకు కారణమని పేర్కొంటున్నారు. వారు అందించిన వివరాల ప్రకారం. తూర్పు- పశ్చిమ షీర్ జోన్ ఒక చోదక శక్తిగా నైరుతిని ముందుండి నడిపిస్తోంది. ఈ ఏడాది మే మధ్యలో ఏర్పడిన షీర్ జోన్, అరేబియా సముద్రం, బంగాళాఖాతం రెండింటిలోనూ అల్పపీడన వ్యవస్థలను ప్రేరేపించడంతో.. రుతుపవనాలు చురుగ్గా కదిలేందుకు అవకాశం కలిగింది. ఈనెల 24 నాటికి రుతు పవనాలు కేరళను తాకే సూచనలు కనిపిస్తున్నాయి. 26 నాటికి రాయలసీమ అంతటా.. దక్షిణ కోస్తా జిల్లాల్లోని సీమ సరిహద్దు ప్రాంతాల్లోనూ విస్తరించనున్నాయి. 28 నాటికి దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల మొత్తం, 29 నాటికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రమంతటా విస్తరించేందుకు అనుకూల వాతావరణ పరిస్థితులున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈసారి వర్షపాతం దీర్ఘకాలిక సాధారణ సగటు 104 శాతం కంటే 5 శాతం అదనంగా పడే సూచనలున్నాయి.



**ఈ నెల.27న అల్పపీడనం ఏర్పడే అవకాశం!**

ఓవైపు నైరుతి చురుగ్గా కదులుతున్న తరుణంలో.. మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించేలా అల్పపీడనం ఏర్పడుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 27న అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడవచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసే సూచనలున్నాయని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని పేర్కొంది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఈ నెల్లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయని ఏపీ వాతావరణ శాఖ అధికారి స్టెల్లా వెల్లడించారు. ఈనెల 1 నుంచి 21 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ సగటు వర్షపాతం 39.2 మిమీ కాగా, 126 శాతం అధికంగా 88.5 మిమీ వర్షపాతం నమోదైందని తెలిపారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో 'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రిక సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) — బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు — గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) — స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు — సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455
జి.హిరణ్మాయి (కన్నల్) — నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
ఆళ్ల వీరభద్రరావు (భద్రం) — గుంటూరు జిల్లా క్రైం రిపోర్టర్ సెల్ : 9848411984
చెట్టిపోగు కాశి — దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
శేషగిరి రాజు — మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు — గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు — సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951
చెవుల రంగారావు — మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ — మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ — తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య — వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
ఎస్.కె.రఫీ — చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 99493352147
జి.ఏలియా — ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు — రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ — దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు — పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు — రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ — ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ — నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ — శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి — నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
లక్ష్మీనారాయణ — రెంటచింతల రిపోర్టర్ సెల్ : 800079075
వి.వెంకటరెడ్డి — బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991
పి.వెంకటేశ్వర్లు — దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ — వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ — గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ — నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు — మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
సి.హెచ్.ప్రసాద్ — గుంటూరు సిటీ రిపోర్టర్ సెల్ : 8125309319
పి.ఆనంద్ — వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
జి.బాలాజీ — తాడికొండ రిపోర్టర్ సెల్ : 9603424824
రమేష్ — నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
తేళ్ల రవీంద్రబాబు — గుంటూరు రిపోర్టర్ సెల్ : 7396234032
డి.మల్లికార్జునరావు — యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.